క్లుప్తంగా

సురక్షిత ప్రయాణంపై అవగాహన



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగనంపూడి: రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్తతో వ్యవహరించాలని దువ్వాడ ఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్లాట్‌ఫాంలపై అవగాహన కల్పించారు. కదులుతున్న రైలు ఎక్కడం , దిగడం చేయరాదని, సురక్షిత ప్రయాణం ముఖ్యమని వివరించారు. ప్లాట్‌ఫాం-1, 4ల వైపు తరచూ ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో ప్రయాణికులకు శనివారం అవగాహన కల్పించారు. డోర్‌ల వద్ద కూర్చోవడం, మెట్లపై వేలాడుతూ వెళ్లడం మంచిది కాదని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నిర్వాసితుల నిరాహారదీక్ష

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరుతూ నడుపూరుకు చెందిన నిర్వాసితుల ఆధ్వర్యంలో 24 గంటల నిరాహార దీక్ష చేయనున్నారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు నడుపూరు జంక్షన్‌లో చేపట్టనున్న ఈ దీక్షను విజయవంతం చేయాలని నిర్వాసితుల సంఘం నాయకులు కోరారు.

జోరుగా పందుల ఏరివేత



అరుణా థియేటర్ సమీపంలో కాల్చివేసిన పందులు

పెదగంట్యాడ: మండలంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులను జీవీఎంసీ అధికారులు శనివారం ఏరివేశారు. పెదగంట్యాడ అరుణా థియేటర్ వెనుక శుక్రవారం నాగేంద్ర అనే వ్యక్తిపై పంది దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు స్పందించారు. శనివారం ఉదయం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, వీధుల్లో తిరుగుతున్న పందులను షూటర్‌తో షూట్ చేయించారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పందుల పెంపకందారులను ఎన్నిసార్లు హెచ్చరించినా వాటిని వీధుల్లో వదిలేయడంతో ప్రజలపై దాడులు చేస్తున్నాయన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా వాటిని పూర్తిగా ఏరివేయనున్నామని తెలిపారు.

శారీరక దారుఢ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ



పోలీసు ఉద్యోగార్థులకు సూచనలిస్తున్న సీఐ సోమశేఖర్

ఏయూక్యాంపస్: పోలీసు ఉద్యోగాల నియామక ప్రక్రియలో శారీరక దారుఢ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మహారాణిపేట సీఐ సోమశేఖర్ సూచించారు. అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు ఉద్యోగార్థుల శిక్షణ తరగతుల శిబిరానికి శనివారం ఆయన హాజరై అభ్యర్థులకు పలు సూచనలిచ్చారు. ఉద్యోగం సాధించడంలో శారీరక దారుఢ్య పరీక్ష తొలి మెట్టుగా నిలుస్తుందన్నారు. సరైన శిక్షకుల పర్యవేక్షణలో మెళకువలు నేర్చుకోవాలని, దీని వల్ల సులభంగా పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం వీలవుతుందని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండటం, నిత్యం వ్యాయామం చేయడం ఎంతో అవసరమన్నారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని యువత పరిరక్షించుకోవాలని సూచించారు. బాధ్యతాయుత పౌరులుగా, భవిష్యత్ సమాజ రక్షకులుగా నిలవాలని సీఐ సోమశేఖర్ ఆకాంక్షించారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 68వ వార్డులో రూ.1.32 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన



అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక అభివృద్ధి శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో శరవేగంగా పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 68వ వార్డులో రూ.1 కోటి 32.95 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా మన ముఖ్యమంత్రి పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు అభివృద్ధికి ఆటంకాలు కల్పిస్తున్నా.. వెనుకడుగు వేయకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని తిరిగి గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే తపనతో జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. గాజువాక అభివృద్ధికి తిప్పల నాగిరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. 68వ వార్డు మిందిలో శ్మశానవాటికకు రూ.49.95 లక్షలు, అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటికకు రూ.49 లక్షలు, గుడివాడ అప్పన్నకాలనీ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.30 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. సర్వీసు రోడ్డు నుంచి అక్కిరెడ్డిపాలెం గ్రామంలోకి ప్రవేశించే రోడ్డు నిర్మాణానికి రూ.4 లక్షలతో చేపట్టనున్న పనులకు కొబ్బరికాయ కొట్టి, శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, పోలవరపు శ్రీహరి, నేలపాటి సత్యవతి, సయ్యద్ హుస్సేన్, ఈటి సురేష్, గుడివాడ శ్రీనివాసరావు, చిట్టిబాబు, శ్యాంబాబు, ఎం.సత్యవతి, సచివాలయాల కార్యదర్శులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

చిట్టచివరి అర్హుడి వరకు ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 67వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: చిట్టచివరి అర్హుడి వరకు ప్రభుత్వ పథకాలను అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 67వ వార్డులో గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి అందుతున్న పథకాలను వివరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, స్థానిక నాయకులు ఎస్ఎండీ గౌస్, పల్లా పెంటారావు, అచ్చెయ్యనాయుడు, సూర్యనారాయణ, రాజేష్, జి.లలిత, కామినాయుడు, ఈశ్వరరావు, కోటి, పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్వాలిటీ సర్కిల్ పోటీల్లో విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ఎల్ అండ్ డీసీ విభాగాధిపతి భాను

ఉక్కునగరం: జాతీయ క్వాలిటీ సర్కిల్ పోటీల్లో స్టీల్ ప్లాంట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ విభాగం జట్టుకు పార్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఔరంగాబాద్‌లో ఇటీవల క్వాలిటీ సర్కిల్, ఫైవ్ ఎస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విభాగం ఉద్యోగులు రామకృష్ణ, దీపాంకర్ డే, ప్రసాదరావు, శ్రీనివాస్, వాసుల జట్టు ఈ అవార్డు గెలుపొందింది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జట్టు సభ్యులను విభాగాధిపతి ఎన్. భాను అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈ అవార్డు సృజనాత్మకతతో కూడిన సాంకేతిక నైపుణ్యానికి దక్కినదిగా అభివర్ణించారు. కార్యక్రమంలో విభాగం అధికారులు శాస్త్రి, మురళీ మోహన్, రమేష్, సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ హాస్టల్స్ లంబసింగి యాత్ర ప్రారంభం



యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఉక్కునగరం యూనిట్ ఆధ్వర్యంలో శనివారం లంబసింగి విహార యాత్ర ప్రారంభమైంది. ఉక్కునగరం యూనిట్ నుంచి మధ్యాహ్నం ప్రారంభమైన యాత్రను యూత్ హాస్టల్స్ ప్రోగ్రాం డైరెక్టర్ వి.ఆర్.కె. రాజు, ఫీల్డ్ డైరెక్టర్ పి. శ్రీనివాస్, కో-డైరెక్టర్ టి.వి.ఎన్. రాజు, ఏఐటీయూసీ నాయకుడు కె.ఎస్.ఎన్.రావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ఖర్చుతో వివిధ ప్రదేశాలను సందర్శించే అవకాశాలు కల్పించడం యూత్ హాస్టల్స్ ధ్యేయమన్నారు. రెండు రోజుల యాత్రలో భాగంగా స్ట్రాబెర్రీ ఫీల్డ్స్, వ్యూ పాయింట్, సమ్మగిరి వాటర్ ఫాల్స్‌లను సందర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ చైర్మన్ పి. సత్యానందం, సాయిరామరాజు, చీకటి శ్రీనివాస్, కాసా పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు కృషి చేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్ రెడ్డి కోరారు. భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన గాజువాక నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గాజువాకలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు చేపట్టాల్సిన చర్యలు, విధి విధానాలను సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గొంపా గోవింద్, నగర ప్రధాన కార్యదర్శి గవర వెంకటరమణారావు, భెల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, లక్కరాజు రామారావు, సీహెచ్.మురళీశ్వరరావు, గుడివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ భూములు ఆక్రమిస్తే చర్యలు

ఎస్‌డీసీ రామమోహన్‌రావు



శీకువానిపాలెంలో స్టీల్‌ప్లాంట్ స్థలాల లే-అవుట్‌ను పరిశీలిస్తున్న ఎస్‌డీసీ రామమోహన్‌రావు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జేవీవీఎస్ రామమోహన్‌రావు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ఎస్‌డీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం ఉదయం పెదగంట్యాడ మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు వెల్లువెత్తడంతో స్పందించిన ఆయన, ఆయా భూములను పరిశీలించారు. నడుపూరులోని శీరవానిపాలెం, నెల్లిముక్కు పెంటమాంబ ఆలయం వద్ద, శీకువానిపాలెం తదితర ప్రాంతాల్లోని స్టీల్‌ప్లాంట్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదగంట్యాడ మండలంలో ఉక్కు నిర్వాసితులకు కేటాయించిన భూములు ఎక్కువగా ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటికి సంబంధించి ఆయా రికార్డులను పరిశీలిస్తున్నామని చెప్పారు. రికార్డులు సక్రమంగా ఉంటే ఫర్వాలేదని, లేని పక్షంలో ఆయా అక్రమ నిర్మాణాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్ఐ రవికుమార్, సర్వేయర్ వరిబంధు, వీఆర్వోలు శివశంకర్, అనూష, కావ్య ఉన్నారు.

ప్రజా ఉద్యమాలకు తలవంచక తప్పదు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

- స్టీల్‌ప్లాంట్ జోలికి వస్తే కేంద్రానికి గుణపాఠం
- స్పష్టం చేసిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- దీక్షలకు మాతృశ్రీనగర్ మహిళల సంఘీభావం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా ప్రజా ఉద్యమాల ముందు తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో 695వ రోజు శనివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులతో పాటు కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన మాతృశ్రీనగర్ ఫేజ్-2,5,7 నుంచి మహిళామణులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్య రామ్, ఎన్.రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, వై.టి. దాస్, జె.రామకృష్ణ, కారు రమణ, గుమ్మడి నరేంద్ర, ఐద్వా ప్రతినిధులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ, వాటిని అమలు చేసే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కొనడానికి ఎవరు ముందుకు వచ్చిన అడ్డుకుంటామన్నారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, స్థానిక ప్రజలు కుటుంబసభ్యులతో కలిసి పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టి.ఎస్.ఎన్, బి.ఎం.ఎల్.నాయుడు, విశ్వేశ్వరరావు, ఇతర కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

టోల్‌గేటు తరలింపునకు కృషి



టోల్‌గేటు వద్ద ఎంపీ జీవీఎల్ తదితరులు

అగనంపూడి: అగనంపూడి టోల్‌గేటును త్వరితగతిన తరలించేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన టోల్‌గేటును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. అగనంపూడి టోల్‌గేటు స్థానికులకు భారంగా మారిందని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ విషయంపై గత పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తానని, సమాధానం ఇంకా రావాల్సి ఉందన్నారు. తదుపరి సమావేశాల్లోనూ సంబంధిత మంత్రితో మాట్లాడి స్పష్టత తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు కోసూరి తాతారావు, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, రోహిణి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



సింహాచలం వెంకన్న ఆలయంలో విశేష అలంకరణలో గోదాదేవి



పెందుర్తి వెంకటాద్రిపై వెంకన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: ధనుర్మాస పూజలను పలు ఆలయాల్లో శనివారం విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై తెల్లవారుజామున 3 గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరువీధి జరిపారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, వేద పండితులు, అధ్యాపకులు పూజలు నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో....

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై అధిష్టంప జేశారు. తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు పూజలు చేశారు.

వెంకటాద్రిపై..

పెందుర్తి వెంకటాద్రిపై ఉదయం తిరుప్పావై సేవాకాలం .. గోదాదేవికి వైభవంగా పూజలు నిర్వహించారు. వెంకన్నకు విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజలు నిర్వహించారు.

బాల్యం నుంచి డిజిటల్ విద్య తప్పనిసరి



డిజిటల్ సంసిద్ధత సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఉక్కునగరం: మారుతున్న పరిస్థితుల దృష్ట్యా బాల్యం నుంచి టెక్నాలజీతో కూడిన విద్య తప్పనిసరి అని రాష్ట్ర ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఉక్కునగరం శృష్టి వరల్డ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన పాఠశాల స్థాయి డిజిటల్ సంసిద్ధత సమ్మిట్-2023ను ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించేలా విద్యార్థులు సంసిద్ధులు కావాలన్నారు. ఈ దిశగా శృష్టి వరల్డ్ యాజమాన్యం విద్యార్థులకు బాల్యం నుంచి టెక్నాలజీతో కూడిన విద్యను అందిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రత్యేక అతిథి, అర్జున్ అవార్డు గ్రహీత, స్కేటింగ్ జాతీయ కోచ్ అనుప్ కుమార్ యామ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలన్నారు. పాఠశాల ఈడీ డాక్టర్ మేఘన మాట్లాడుతూ పాఠశాలకు ఈ విద్యా సంవత్సరంలో అత్యున్నతమైన బ్రెయిన్ ఫీడ్ అవార్డు, మెక్‌మిలాన్ స్కూల్ ఇన్నోవేషన్ అవార్డులు లభించాయన్నారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్.శేషారెడ్డి, పాఠశాల డైరెక్టర్ పి. సుశీలారాణి, కార్పొరేటర్ బి. గంగారావు, ప్రిన్సిపాల్ ఇ.చంద్రిక, వైస్ ప్రిన్సిపాల్ కావ్యభాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రివిక్రముడిగా అప్పన్న



త్రివిక్రముడి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శనివారం త్రివిక్రముడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టంప జేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఉచిత కంటి వైద్య శిబిరం నేడు

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో కిమ్స్ ఐకాన్ (డెయిరీ ఆస్పత్రి) సహకారంతో ఈ నెల 8న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేయనున్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దొడ్డి రమణ కోరారు. రోగులు విధిగా ఆధార్ కార్డు, హెల్త్ కార్డు తీసుకురావాలని సూచించారు.

నేడు వైభవుడికి కదంబ ప్రసాద నివేదన



కదంబ ప్రసాదానికి సరకులు సిద్ధం చేస్తున్న మహిళలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం కదంబ ప్రసాదం నివేదించనున్నామని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రసాదాన్ని 21 రకాల కూరగాయలు, ఆకుకూరలతో సమ్మిళితంగా తయారు చేయిస్తామన్నారు. ఇందుకోసం అవసరమైన సరకులను మహిళలు శనివారం సిద్ధం చేశారు. ఈ ప్రసాదం తింటే ఆరోగ్యంగా ఉంటామని భక్తులు నమ్ముతారు. దీన్ని ఆలయంలో భక్తులకు వడ్డిస్తారు. ఉదయం పూజలు పూర్తయిన తర్వాత ప్రసాదాన్ని అందిస్తారు.

అర్హత ఉన్న అందరికీ పెన్షన్లు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందజేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. జీవీఎంసీ 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి సమక్షంలో వార్డు పరిధిలోని సచివాలయ సిబ్బంది ఎమ్మెల్యే నాగిరెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కొంతమందికి పెన్షన్లు ఆపేశారంటూ ప్రచారం చేస్తున్నారని, ఎక్కడా ఒక్క పెన్షన్ కూడా ఆపవద్దన్నారు. కొత్తగా మంజూరైన పెన్షన్లను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.

ఏయూ వీసీతో కేఎస్‌బీ కార్యదర్శి భేటీ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ సైనిక్ బోర్డ్ (కేఎస్‌బీ) కార్యదర్శి కమోడోర్ హెచ్.పి సింగ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, వివిధ అంశాలపై చర్చించారు. క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో రక్షణ రంగాలలో వైద్యవిభాగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు డిప్లమా ఇన్ ఫార్మసీ అందించాలని ప్రతిపాదన చేశారు. ఈ దిశగా ఏయూతో ఎంవోయూ చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. రక్షణ రంగాల ఉద్యోగుల సతీమణులకు బీఏ ఫైన్‌ఆర్ట్స్ కోర్సును ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే అంశంపై చర్చించారు. రక్షణ రంగాల ఉద్యోగులకు ఏయూ పరంగా అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.